https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్

ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 312 గురువారం 29-1-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.



# గద్దెపైకి సారలమ్మ

## ఉదయం నుంచి సారలమ్మ గుడిలో పూజలు

**సాయంత్రం బయలుదేరిన కన్నెపల్లి కల్పవల్లి**

**అడుగడుగునా భక్తుల నీరాజనం.. కన్నెపల్లి నుంచి మేడారం దాకా 2 కి.మీ. మేర బారులు**

**డోలు వాయిద్యాలతో సంప్రదాయ నృత్యాలు**

**శిగమూగిన వేలాది మంది మహిళలు**

**నేడే గద్దెపైకి సమ్మక్క తల్లి.. పూర్తైన ఏర్పాట్లు**


**జంపన్నవాగులో కొట్టుకుపోయి ఒకరి మృతి**

**మేడారం, జనవరి 28:**
లక్షలాది మంది భక్తులు నిలువెల్లా కనులై ఎదురుచూస్తున్న సారలమ్మ బుధవారం ఆదివాసీ సంప్రదాయాల మధ్య అట్టహాసంగా మేడారంలోని గద్దెపైకి చేరుకుంది. దీనితో మహా జాతర తొలిఘట్టం ప్రశాంతంగా పూర్తయినట్టయింది. కన్నెపల్లిలోని గుడి నుంచి సారలమ్మ బుధవారం రాత్రి 7.38 గంటలకు బయలు దేరింది. జంపన్నవాగు వద్దకు 8.48 గంటలకు చేరుకున్నది. అక్కడి నుంచి అశేష భక్తజనం నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి మేడారంలోని గద్దెపై ప్రతిష్ఠించారు. అమ్మను పూజారులు మేడారంలోని గద్దెకు తరలించే ఘట్టం భక్తులను దివ్యానుభూతికి లోను చేసింది. ఈ ప్రక్రియ బుధవారం ఉదయం నుంచే మొదలైంది. కన్నెపల్లిలోని సారలమ్మ గుడిని పూజారుల కుటుంబ సభ్యులు తొలుత శుద్ధి చేశారు. గుడి లోపల, బయట అలికి ముగ్గులు వేసి మామిడి తోరణాలు, బంతి పూలతో అందంగా అలంకరించారు. సాయంత్రం అసలైన పూజాతంతు మొదలైంది. పూజా మందిరంలో ప్రధాన పూజారి కాక సారయ్యతో పాటు ఇతర వడ్డెలు రహస్య పూజలు చేశారు. లోపల పూజలు జరుగుతున్నంతసేపూ గుడి బయట ఆదివాసీ కళాకారులు డోలు వాయిద్యాలతో సంప్రదాయ నృత్యాలు చేశారు. సారలమ్మను కీర్తిస్తూ పాటలు పాడారు. శివసత్తులు శిగమూగారు. మరోవైపు.. సారలమ్మ రాకను కళ్లారా చూడాలన్న తపనతో వేలాదిగా భక్తులు ఉదయం నుంచే పెద్దసంఖ్యలో కన్నెపల్లికి చేరుకున్నారు. సాయంత్రం 7 గంటల వరకూ గుడి లోపల పూజలు జరిగాయి. పూజారి కాక సారయ్య.. సారలమ్మ ప్రతి రూపమైన కుంకుమ భరిణను తీసుకొని బయలుదేరుతున్న



సంకేతం అందగానే అప్పటి వరకు గుడి బయట వేచివున్న వేలాది భక్తజనం శిగమూగారు. సంతానం లేనివారు పిల్లల కోసం వరాలు పట్టారు.

మిగతా 3లో...



## సీఎంకు పాలన చేతగాక..
# తప్పించుకునే యత్నం!

**మునిసిపల్ ఎన్నికల్లో గొప్ప విజయం సాధించాలి**

**ఆరూరి రమేశ్‌ను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన కేటీఆర్**

**హైదరాబాద్, జనవరి 28**
రేవంత్‌రెడ్డికి పరిపాలన చేతగాక అప్పుల పేరుతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. కేంద్రం, ఆర్బీఐ, కాగ్‌లు నామమాత్రపు రుణాలున్నాయని చెబుతున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అప్పుల సంఖ్య పెంచి తప్పుడు లెక్కలు చూపుతోందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ బీజేపీకి రాజీనామా చేసి తన అనుచరులతో కలిసి బుధవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎ?సలో చేరారు. కేటీఆర్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన ప్రతి పైసా అప్పును సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకే వినియోగించిందని గుర్తుచేశారు. కానీ, రేవంత్‌రెడ్డి రెండేళ్లలో తెచ్చిన రూ.2.50 లక్షల కోట్ల అప్పుతో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టలేదన్నారు. అన్ని రంగాల్లో విఫలమైన కాంగ్రెస్ సర్కారు పాలనకు వ్యతిరేకంగా అందరూ కలిసికట్టుగా పోరాడాలని, రాబోయే మునిసిపల్ ఎన్నికల్లో గొప్ప విజయం సాధించాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రమేశ్ గతంలో వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశారని, దాదాపు లక్ష ఓట్ల మెజారిటీతో గెలిచిన ఆయన 16 ఓట్ల తేడాతో ఓడిపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. పార్టీలో అందరినీ కలుపుకొని ముందుకెళ్లి, మునిసిపల్ ఎన్నికల్లో అద్భుతమైన విజయం సాధించాలని రమేశ్‌ను కోరారు.

## మేనల్లుడితో కలిసి భర్తను చంపిన భార్య

మాడ్గులపల్లి, జనవరి 28 మేనల్లుడితో తన వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడనే కారణంతో కట్టుకున్న భర్తనే చంపేసిందో భార్య. మేనల్లుడితో కలిసి ఈ ఘాతుకానికి పాల్పడిన ఆమె.. హత్య అనంతరం మేనల్లుడితో కలిసి పరారైంది. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం సీత్యాతండాలో బుధవారం ఈ ఘటన జరిగింది. సీత్యాతండాకు చెందిన రమావత్ రవి(34)కి మిర్యాలగూడ మండలం ఏడుకోట్లతండాకు చెందిన లక్ష్మితో 11ఏళ్ల క్రితం పెళ్లయింది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు సూర్యాపేటలో చదువుతుండగా, చిన్న కుమారుడు మానసిక దివ్యాంగుడు. రవి వేములపల్లి మండలం సల్కునూరు పీఏసీఎసలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. అయితే, రవి అక్క కుమారుడైన గణేశ్‌తో లక్ష్మికి వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయంలో దంపతుల మధ్య గొడవలు జరగ్గా లక్ష్మి ఏడాది క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. రవి తల్లిదండ్రులు పెద్ద మనుషులతో మాట్లాడి లక్ష్మిని తిరిగి అత్తారింటికి తీసుకొచ్చారు. జనవరి 26న భార్యాభర్తల మధ్య మరోమారు గొడవ జరిగింది. అయితే, రవి పెద్ద కుమారుడిని హాస్టల్‌కు చేర్చేందుకు అతని తండ్రి లక్ష్మానాయక్ జనవరి 27న సూర్యాపేట వెళ్లగా, తల్లి పొలం పనికి వెళ్లింది. వారు సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి కుమారుడి గదిలో లైట్లు వెలుగుతుండటంతో పెద్దగా పట్టించుకోలేదు. బుధవారం ఉదయం కొడుకు, కోడలు గది నుంచి రాకపోవడంతో తల్లిదండ్రులు తలుపు తీసి చూడగా రవి విగతజీవిగా పడి ఉన్నాడు. అయితే, హైదరాబాద్‌లోని ఓ బంగారం దుకాణంలో పనిచేస్తున్న మేనల్లుడు మాలోతు గణేశ్‌కు ఈ నెల 27న ఫోన్ చేసిన లక్ష్మి.. అతడిని ఇంటికి పిలిపించినట్టు పోలీసు విచారణలో తేలింది. మద్యం మత్తులో ఉన్న రవిపై లక్ష్మి, గణేశ్ దాడి చేయగా అక్కడికక్కడే మృతిచెందాడని పోలీసులు తెలిపారు.

## బీఆర్ఎస్‌కు రాజీనామా చేయలేదు

**ఆ పార్టీ నుంచి నన్ను సస్పెండ్ చేయలేదు..**

**నేను కాంగ్రెస్‌లో చేరానని బీఆర్ఎస్ భావన**

**నాపై దాఖలైన అనర్హత పిటిషన్ చెల్లదు**

**స్పీకర్‌కు దానం నాగేందర్ అఫిడవిట్**

**30న విచారణకు రావాలని స్పీకర్ నోటీసు**



హైదరాబాద్, జనవరి 28 తాను బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని, తనను సస్పెండ్ చేసినట్లుగా ఆ పార్టీ నుంచి ఎలాంటి సమాచారమూ అందలేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్.. స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు తెలిపారు. తాను 2024 మార్చిలో కాంగ్రెస్ నిర్వహించిన ఓ సమావేశానికి వ్యక్తిగత హోదాలో మాత్రమే వెళ్లానని, మీడియా కథనాల ఆధారంగా తాను పార్టీ మారినట్లుగా బీఆర్ఎస్ భావిస్తోందన్నారు. ఈ మేరకు ఆదివారం స్పీకర్‌కు అఫిడవిట్ ఇచ్చారు. బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌లో లేవనెత్తిన అంశాల వారీగా అఫిడవిట్‌లో వివరణ ఇచ్చిన దానం నాగేందర్.. గతంలో కోర్టులు ఇచ్చిన తీర్పుల ప్రకారం తనపై దాఖలైన పిటిషన్‌లో చూపిన ఏ కారణమూ చెల్లబోదన్నారు. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను కొట్టివేయాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. అనర్హత పిటిషన్‌లోని అంశాలపైన మాత్రమే తాను వివరణ ఇస్తున్నానని, పిటిషన్ తర్వాతి పరిణామాలను అనుబంధ సమాచారంగా అంగీకరించవద్దంటూ స్పీకర్‌ను కోరారు. దానం నాగేందర్ అఫిడవిట్‌ను పరిశీలించిన స్పీకర్ ఈ నెల 30న అనర్హత పిటిషన్‌పై విచారణకు రావాలని నోటీసులిచ్చారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగట?ంలో చేరిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ ఆ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌తోపాటు బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై 30న స్పీకర్ విచారణ చేపడుతున్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు కౌశిక్ రెడ్డి పిటిషన్, మధ్యాహ్నం 12 గంటలకు మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తున్నారు. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాదుల వాదనలను స్పీకర్ వింటారు.



## మహారాష్ట్ర డిప్యూటీ సీఎం
# అజిత్ పవార్ దుర్మరణం

**విమానం కుప్పకూలిన ఘటనలో మృతి**

**ఇద్దరు పైలట్లతో పాటు సహాయకుడు, వ్యక్తిగత భద్రతాధికారి కూడా..**

**పుణె/ జనవరి 28:** ప్రైవేటు జెట్ విమానం కూలిన ఘటనలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ దుర్మరణం పాలయ్యారు. మరో నలుగురు కూడా ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. మహారాష్ట్రలోని పుణె సమీపంలోని బారామతిలో బుధవారం ఉదయం ఈ దుర్ఘటన జరిగింది. మరణించిన వారిలో అజిత్‌తోపాటు విమానం ప్రధాన పైలట్ (పైలట్ ఇన్ కమాండ్) సుమిత్ కపూర్, రెండో పైలట్ (ఫస్ట్ ఆఫీసర్) శాంభవి పాఠక్, సిబ్బంది పింకీ మాలి, పవార్ వ్యక్తిగత భద్రతాధికారి విదీప్ జాధవ్ ఉన్నారు. మహారాష్ట్రలో జిల్లా పరిషత్ ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ ప్రచారం కోసం అజిత్ పవార్ బుధవారం ఉదయం 8.10 గంటలకు ముంబై నుంచి బారామతికి బయల్దేరారు.

3లో...

## కాంగ్రెస్ అభ్యర్థులు గెలుస్తేనే క్యాతనపల్లి అభివృద్ధి..

**మంత్రి జూపల్లి కృష్ణారావు...**



**రామకృష్ణాపూర్, జనవరి 28, (మన సమాజం):** త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు అన్ని వార్డుల్లో గెలుస్తేనే క్యాతనపల్లి మున్సిపాలిటీ అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని క్యాతనపల్లి మున్సిపల్ ఎలక్షన్ ఇంచార్జ్, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి టికెట్ ఆశించే నాయకులకు స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల అభివృద్ధి కొరకు కృషి చేసే అభ్యర్థులను గుర్తించి టికెట్ కేటాయిస్తామని, అలాగే టికెట్ రాని వారు ఎలాంటి నిస్పృహకు లోను కాకుండా అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి పార్టీ అండదండలు ఉంటాయని హామీ ఇచ్చారు. పార్టీకి వ్యతిరేకంగా పని చేయొద్దని సూచించారు. ప్రజాపాలనలో అన్ని వర్గాల ప్రజలకుప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, కోర్ కమిటీ సభ్యులు, వార్డు ఇంచార్జ్ లు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు సిద్ధంగా ఉండండి..

**పిలుపునిచ్చిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్..**




**రామకృష్ణాపూర్, జనవరి 28, (మన సమాజం):** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో క్యాతనపల్లి మున్సిపాలిటీలో ఉన్న అన్ని వార్డుల్లో పోటీకి సిద్ధంగా ఉండాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతో పొత్తు ఉన్నప్పటికీ స్థానిక సంస్థ ఎన్నికల్లో కలిసి వచ్చే పార్టీలతో పొత్తుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అంతే కాకుండా మున్సిపాలిటీ అన్ని వార్డుల్లో తమ పార్టీ అభ్యర్థులను పోటీల్లో నిలపడానికి సైతం సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. సింగరేణి ప్రాంతంలో సిపిఐ పార్టీకి ఉన్న ఆదరణనే మా బలమని హితవు పలికారు.కార్యకర్తల సమన్వయంతో ముందుకెళ్లాలని నాయకులు సూచన చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణకార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, పౌలు, వనం సత్యనారాయణ, మొండి, రాజేశం, మద్దెల శంకర్, రాజు, రవీందర్, సాంబయ్య, శంకర్, కొమురయ్య, రమేష్, చందర్, సత్యం పాల్గొన్నారు.

## బెల్లంపల్లి మున్సిపాలిటీలో 10 నామినేషన్లు



**బెల్లంపల్లి, జనవరి 28 (మన సమాజం):** బెల్లంపల్లి మున్సిపాలిటీలో 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు మొత్తం 10 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు.వివరాల ప్రకారం, వార్డు నంబర్--1 నుంచి బీఆర్ఎస్ పార్టీ నుంచి 1 నామినేషన్, వార్డు నంబర్--3 నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి 1 నామినేషన్, వార్డు నంబర్--5 నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి 1, స్వతంత్ర అభ్యర్థి నుంచి 1 నామినేషన్ దాఖలయ్యాయి. అలాగే వార్డు నంబర్--17 నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి 1, బీఆర్ఎస్ పార్టీ నుంచి 1 నామినేషన్, వార్డు నంబర్--18 నుంచి బీఆర్ఎస్ పార్టీ నుంచి 1 నామినేషన్, వార్డు నంబర్--20 నుంచి బీఆర్ఎస్ పార్టీ నుంచి 1 నామినేషన్, వార్డు నంబర్--33 నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి 1 నామినేషన్ దాఖలైనట్లు తెలిపారు. ఈ విధంగా బెల్లంపల్లి మున్సిపాలిటీలో వివిధ వార్డుల నుంచి మొత్తం 10 నామినేషన్లు దాఖలైనట్లు బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి మీడియాకు వెల్లడించారు.

# గద్దెపై కొలువు దీరిన సారలమ్మ..

**మొక్కులు చెల్లించుకున్న భక్త జనం..**

**బారి బందోబస్తు నిర్వహించిన పోలీసులు...**

**సారలమ్మను దర్శించుకున్న ఏరియా జిఎం రాధాకృష్ణ..**



**రామకృష్ణాపూర్, జనవరి 28, (మన సమాజం):** అతిపెద్ద ఆదివాసీ గిరిజన జాతర అయిన సమ్మక్క-సారలమ్మ మహా జాతర మందమర్రి ఏరియా రామకృష్ణాపూర్ ఆర్కే-1 ఏ పాలవాగు ఒడ్డున బుధవారం వైభవంగా ప్రారంభమైంది. నాలుగు రోజులపాటు జరిగే జాతరలో బాగంగా బుధవారం సారలమ్మ గద్దెపై కొలువుదీరింది. స్థానిక పోచమ్మ ఆలయం నుండి సమ్మక్క - సారలమ్మ వంశస్థులు, ప్రధాన పూజారులు డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి గద్దెపై ప్రతిష్టించారు. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. అమ్మ సమ్మక్క - సారలమ్మ అంటూ ప్రజలు భక్తిలో పరవశమ య్యారు. జాతరకు వచ్చిన భక్తులకు ఏరియా జిఎం రాధాకృష్ణ అన్ని ఏర్పాట్లను చేశారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చేసుకోకుండా మందమర్రి సిఐ రమేష్ ఆధ్వర్యంలో బారి బందోబస్తు ఏర్పాటు చేశారు.సారలమ్మను దర్శించుకున్న వారిలో బెల్లంపల్లి ఎసిపి రవికుమార్, ఎస్వోటూ జిఎం ప్రసాద్, గుర్తింపు సంఘం నాయకులు సలేంద్ర సత్యనారాయణ, అక్బర్ అలీ, నాయకులు గాండ్ల సమ్మయ్య ఉన్నారు. బంధుబస్తులో మందమర్రి సర్కిల్ పరిధిలోని సుమారు వందమంది పోలీసులు, సింగరేణి రెస్క్యూ సిబ్బందితో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.





# బెల్లంపల్లిలో బీజేపీలో చేరికలు



**బెల్లంపల్లి, జనవరి 28 (మన సమాజం):** బెల్లంపల్లి పట్టణ బీజేపీ అధ్యక్షురాలు ధార కళ్యాణి ఆధ్వర్యంలో బుధవారం పలు వార్డుల నుంచి పలువురు నేతలు భారతీయ జనతా పార్టీలో చేరారు. 23వ వార్డు నుంచి మాజీ ఎమ్మెల్యే దాసరి నరసయ్య కుటుంబ సభ్యులు దాసరి అరుణసుందరి నరేంద్ర మోదీ నాయకత్వంలోని పాలనకు ఆకర్షితులై బీజేపీలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్, జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి కన్నెబోయిన ఓదెలు, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, పట్టణ ఎన్నికల ఇన్‌చార్జి రావుల రాజేందర్ పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. అలాగే జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో 18వ వార్డు నుంచి రచ్చ స్వప్న, రచ్చ చక్రి, 34వ వార్డు నుంచి కొక్కుల రామ్మూర్తి బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యాల ఏమాజీ, ఎన్నికల కన్వీనర్ బుల్లెట్ల కేశవరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి కుని రాజుల అరవింద్, జిల్లా ఉపాధ్యక్షులు పి. వెంకటకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎస్. శ్రావణ్, సోషల్ మీడియా కన్వీనర్ ఓం సాయి, ఏర్రోజు శ్రీనివాస్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# నామినేషన్ల ప్రక్రియలో అప్రమత్తంగా వ్యవహరించాలి

**ఎన్నికల నియమ నిబంధనల ఉల్లంఘనపై ఫిర్యాదులకు కంట్రోల్ రూమ్: 08736-250501**

**-- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**





**బెల్లంపల్లి, జనవరి 28 (మన సమాజం):** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ల ప్రక్రియలో అధికారులు, అభ్యర్థులు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. బుధవారం బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ జె. సంపత్‌తో కలిసి ఆయన సందర్శించి, నామినేషన్ల స్వీకరణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 30వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 34 వార్డులకు సంబంధించి అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత సమయంలో నామినేషన్ పత్రాలను స్వీకరించాలని, 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఉన్నవారి నుంచి మాత్రమే నామినేషన్లు తీసుకుంటామని, ఆ సమయం తర్వాత వచ్చిన వారి నామినేషన్లు స్వీకరించబోమని స్పష్టం చేశారు. నామినేషన్ల స్వీకరణ కోసం ప్రత్యేక టేబుళ్లు ఏర్పాటు చేయడంతో పాటు 100 మీటర్ల నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. నామినేషన్ దరఖాస్తులు నింపడం, జతపరచవలసిన పత్రాలు తదితర వివరాల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జనవరి 31వ తేదీన నామినేషన్ల పరిశీలన, అర్హులైన అభ్యర్థుల జాబితా ప్రకటన జరుగుతుందని, ఫిబ్రవరి 1వ తేదీన నామినేషన్లపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ, 2వ తేదీన వాటి పరిష్కారం, 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన (ఏమైనా అవసరమైతే) రీపోలింగ్, 13వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించి గెలుపొందిన అభ్యర్థులను ప్రకటిస్తామని కలెక్టర్ వివరించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం. 08736-250501 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల సంబంధిత సమాచారం కోసం, అలాగే ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదుల కోసం ఈ నంబర్‌ను సంప్రదించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు.

మన సమాజం

తెలుగు డిజిటల్ దినపత్రిక

గురువారం, జనవరి 29, 2026

## మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం

**విమానం కుప్పకూలిన ఘటనలో మృతి**

**ఇద్దరు పైలట్లతో పాటు సహాయకుడు, వ్యక్తిగత భద్రతాధికారి కూడా..**

**ముంబై నుంచి బారామతికి వెళ్తుండగా దుర్ఘటన**

**బుధవారం ఉదయం 8.45 గంటలకు ప్రమాదం**

**పొగ మంచు కారణంగా రన్ వే కనబడక ఇబ్బంది**

**బారామతి విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు ముందు రన్‌వే మొదట్లో కూలిన విమానం**

**చిన్న ఎయిర్‌ఫీల్డ్ కావడంతో అందుబాటులో లేని 'ఇన్‌స్ట్రుమెంటల్ ల్యాండింగ్ సిస్టమ్'**

**స్థానిక పైలట్లతోనే ఎయిర్ ట్రాఫిక్ పర్యవేక్షణ**

**రాష్ట్రపతి, ప్రధాని, ఇతర ప్రముఖుల దిగ్భ్రాంతి**



పుణె/ జనవరి 28: ప్రైవేటు జెట్ విమానం కూలిన ఘటనలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ దుర్మరణం పాలయ్యారు. మరో నలుగురు కూడా ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. మహారాష్ట్రలోని పుణె సమీపంలోని బారామతిలో బుధవారం ఉదయం ఈ దుర్ఘటన జరిగింది. మరణించిన వారిలో అజిత్‌తోపాటు విమానం ప్రధాన పైలట్ (పైలట్ ఇన్ కమాండ్) సుమిత్ కపూర్, రెండో పైలట్ (ఫస్ట్ ఆఫీసర్) శాంభవి పాఠక్, సిబ్బంది పింకీ మాలి, పవార్ వ్యక్తిగత భద్రతాధికారి విదీప్ జాధవ్ ఉన్నారు.

### ఎన్నికల ప్రచారం కోసం బయలుదేరి..

మహారాష్ట్రలో జిల్లా పరిషత్ ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ ప్రచారం కోసం అజిత్ పవార్ బుధవారం ఉదయం 8.10 గంటలకు ముంబై నుంచి ఢిల్లీ వీఎ?సఆర్ వెంచర్స్ సంస్థకు చెందిన లియర్‌జెట్-45 అద్దె విమానంలో పుణె జిల్లాలోని బారామతికి బయల్దేరారు. ఈ రెండింటి మధ్య దూరం 256 కిలోమీటర్లు, ప్రయాణ సమయం సుమారు 45 నిమిషాలు. విమానం 8.39 గంటల సమయంలో బారామతి సమీపానికి చేరుకుంది. కానీ ల్యాండ్ అవకుండా ముందుకెళ్లింది. కాసేపటికి తిరిగి వచ్చి ల్యాండ్ కావడానికి ప్రయత్నిస్తూ.. రన్ వేకు కాస్త ముందే కూలిపోయింది. నేలపై రెండు ముక్కలుగా విడిపోయి, మంటల్లో చిక్కుకుంది. వరుసగా నాలుగైదు పేలుడు శబ్దాలు వినిపించాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని, విమానంలోని వారిని బయటికి తీసేందుకు ప్రయత్నించారు. కానీ మంటలు తీవ్రంగా ఉండటంతో వీలుకాలేదని తెలిపారు. అజిత్ పవార్ భార్య సునేత్ర రాజ్యసభ ఎంపీగా ఉన్నారు. వారికి పార్థ్, జయ్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం ఉదయం బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్‌లో ప్రభుత్వ లాంఛనాలతో అజిత్‌పవార్ అంత్యక్రియలు జరగనున్నాయి. అజిత్ దుర్మరణం నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల పాటు సంతాప దినాలుగా ప్రకటించింది. ఘటనపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఇతర ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనపై విమాన ప్రమాదాల దర్యాప్తు సంస్థ (ఏఏఐబీ) దర్యాప్తు చేపట్టింది. ప్రమాద స్థలంలో ఆధారాలను సేకరించింది.

### పొగ మంచు కారణంగానే ప్రమాదం

దట్టంగా కమ్ముకున్న పొగ మంచు కారణంగానే అజిత్ పవార్ ప్రయాణిస్తున్న విమానం కూలిపోయినట్టు పౌర విమానయాన శాఖ ప్రాథమికంగా నిర్ధారించింది. పైలట్లు ల్యాండింగ్ కోసం పలుమార్లు ప్రయత్నించి, చివరికి రన్‌వేకు సమీపంలోనే కూలిపోయినట్టు తేల్చింది. విమానాల నిర్వహణ సంస్థ తరఫునగానీ, విమానంలోగానీ భద్రతాపరమైన లోపాలేమీ లేవని పేర్కొంది. దీనిపై తొలుత పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు పలు వివరాలను వెల్లడించారు. అనంతరం పూర్తి వివరాలతో ఆ శాఖ ప్రకటన విడుదల చేసింది. ముంబై నుంచి బయలుదేరిన ఈ విమానం పైలట్లు సుమారు 55 కిలోమీటర్ల దూరంలో ఉండగానే బారామతి విమానాశ్రయం ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)ని సంప్రదించారు. వాతావరణ పరిస్థితి, విజిబులిటీ ఆధారంగా ల్యాండింగ్‌కు ప్రయత్నించాలని పైలట్లకు ఏటీసీ సూచించింది. గాలి వేగం, విజిబిలిటీ, ఇతర అంశాలు బాగానే ఉన్నాయని పైలట్లు సమాధానమిచ్చారు. విమానాశ్రయం సమీపంలోకి చేరుకున్నాక ల్యాండింగ్ కోసం విమానాన్ని కిందకు తీసుకొచ్చారు. కానీ రన్ వే కనిపించడం లేదంటూ ఏటీసీకి సమాచారమిచ్చి మళ్లీ పైకి తీసుకెళ్లారు. అలాగే ముందుకెళ్లి, చుట్టూ తిరిగి మళ్లీ రన్ వే ప్రారంభం వైపు వచ్చారు. ఆ సమయంలో విమానం సుమారు కిలోమీటరు ఎత్తున, గంటకు 237 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తోంది. రన్‌వే కనిపిస్తోందా అని ఏటీసీ సిబ్బంది అడిగితే.. ఇంకా కనిపించలేదని, కనబడగానే సమాచారం ఇస్తామని చెప్పారు. కొన్ని సెకన్ల తర్వాత తమకు రన్ వే కనిపిస్తోందని ఏటీసీకి చెప్పారు. రన్ వే-11పై విమానం ల్యాండింగ్‌కు అనుమతిస్తున్నామని 8.43 గంటలకు ఏటీసీ సిబ్బంది సమాచారమిచ్చారు. కానీ పైలట్ల నుంచి తిరిగి సమాధానం(రీడ్ బ్యాక్) రాలేదు. ఏటీసీ అనుమతి ఇచ్చిన మేరకు.. విమానాన్ని ఎంత వేగంతో, ఏ రన్‌వేపై, ఎటువైపునుంచి ల్యాండింగ్ చేస్తున్నారనే వివరాలను పైలట్లు తిరిగి చెప్పడమే రీడ్ బ్యాక్. ఏటీసీ సూచనలను పైలట్లు సరిగా విని, అనుసరిస్తున్నారన్నది నిర్ధారించుకోవడమే దీని ఉద్దేశం. కానీ ఈ విమానం పైలట్లు రీడ్ బ్యాక్ చేయలేదు. తర్వాత ఒకట్రెండు నిమిషాల్లోనే రన్‌వే మొదలవడానికి సుమారు 150మీటర్ల ముందే విమానంకూలిపోయింది. వీఎస్ఆర్ వెంచర్స్ సంస్థ నాన్ షెడ్యూల్డ్ విమాన ఆపరేటర్‌గా పనిచేస్తోంది. అంటే నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం అని కాకుండా.. అవసరాన్ని బట్టి అద్దెపై విమానాలను నడుపుతుంది. ఈ సంస్థ వద్ద తాజాగా కూలిన విమానం సహా ఏడు లియర్ జెట్లు, ఐదు ఎంబ్రాయర్ 135 బీజే, నాలుగు కింగ్ ఎయిర్ బీ200, ఒక పిలాటస్ పీసీ-12 విమానాలు ఉన్నాయి.

# గద్దెపైకి సారలమ్మ

## ఉదయం నుంచి సారలమ్మ గుడిలో పూజలు

**సాయంత్రం బయలుదేరిన కన్నెపల్లి కల్పవల్లి**

**అడుగడుగునా భక్తుల నీరాజనం.. కన్నెపల్లి నుంచి మేడారం దాకా 2 కి.మీ. మేర బారులు**

**డోలు వాయిద్యాలతో సంప్రదాయ నృత్యాలు**

**శిగమూగిన వేలాది మంది మహిళలు**

**నేడే గద్దెపైకి సమ్మక్క తల్లి.. పూర్తైన ఏర్పాట్లు**

**జంపన్నవాగులో కొట్టుకుపోయి ఒకరి మృతి**



**మేడారం, జనవరి 28:**
లక్షలాది మంది భక్తులు నిలువెల్లా కనులై ఎదురుచూస్తున్న సారలమ్మ బుధవారం ఆదివాసీ సంప్రదాయాల మధ్య అట్టహాసంగా మేడారంలోని గద్దెపైకి చేరుకుంది. దీనితో మహా జాతర తొలిఘట్టం ప్రశాంతంగా పూర్తయినట్టయింది. కన్నెపల్లిలోని గుడి నుంచి సారలమ్మ బుధవారం రాత్రి 7.38 గంటలకు బయలు దేరింది. జంపన్నవాగు వద్దకు 8.48 గంటలకు చేరుకున్నది. అక్కడి నుంచి అశేష భక్తజనం నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి మేడారంలోని గద్దెపై ప్రతిష్ఠించారు. అమ్మను పూజారులు మేడారంలోని గద్దెకు తరలించే ఘట్టం భక్తులను దివ్యానుభూతికి లోను చేసింది. ఈ ప్రక్రియ బుధవారం ఉదయం నుంచే మొదలైంది. కన్నెపల్లిలోని సారలమ్మ గుడిని పూజారుల కుటుంబ సభ్యులు తొలుత శుద్ధి చేశారు. గుడి లోపల, బయట అలికి ముగ్గులు వేసి మామిడి తోరణాలు, బంతి పూలతో అందంగా అలంకరించారు. సాయంత్రం అసలైన పూజాతంతు మొదలైంది. పూజా మందిరంలో ప్రధాన పూజారి కాక సారయ్యతో పాటు ఇతర వడ్డెలు రహస్య పూజలు చేశారు. లోపల పూజలు జరుగుతున్నంతసేపూ గుడి బయట ఆదివాసీ కళాకారులు డోలు వాయిద్యాలతో సంప్రదాయ నృత్యాలు చేశారు. సారలమ్మను కీర్తిస్తూ పాటలు పాడారు. శివసత్తులు శిగమూగారు. మరోవైపు.. సారలమ్మ రాకను కళ్లారా చూడాలన్న తపనతో వేలాదిగా భక్తులు ఉదయం నుంచే పెద్దసంఖ్యలో కన్నెపల్లికి చేరుకున్నారు. సాయంత్రం 7 గంటల వరకూ గుడి లోపల పూజలు జరిగాయి. పూజారి కాక సారయ్య.. సారలమ్మ ప్రతి రూపమైన కుంకుమ భరిణను తీసుకొని బయలుదేరుతున్న సంకేతం అందగానే అప్పటి వరకు గుడి బయట వేచివున్న వేలాది భక్తజనం శిగమూగారు. సంతానం లేనివారు పిల్లల కోసం వరాలు పట్టారు. గుడిలో హారతి ఇచ్చి గంటానాథం, బూరకొమ్ము ధ్వనితో మహిళలు గుడి ముందర తడిబట్టలతో సాగిలపడ్డారు.

### దారి పొడవునా నీరాజనాలు

పూజారి సారయ్య సారలమ్మ తల్లి రూపాన్ని తలకెత్తుకొని గుడిబయట అడుగు పెట్టగానే భక్తుల కేరింతలతో తల్లికి స్వాగతం పలికారు. అద్వితీయమైన అనుభూతితో నిలువెల్లా పులకించి పోయారు. దారికి అడ్డంగా పడుకున్న మహిళలపై పసుపు కుంకుమలు, అక్షింతలు, శుద్ధ జలాన్ని చల్లుతూ వారిని దాటుకుంటూ సారయ్య.. తల్లితో ముందుకు సాగారు. సారలమ్మ తల్లి రూపాన్ని తాకాలన్న తపనతో వడ్డెల వద్దకు చేరుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున ముందుకు చొచ్చుకువచ్చారు. అయితే.. రోప్ పార్టీలు వడ్డెలకు రక్షణ వలయంగా నిలబడి దారి కల్పించారు. భక్తులు చొచ్చుకు రాకుండా అడ్డుగా నిలిచారు. సారలమ్మ మేడారంవైపు సాగివస్తుండగా.. కన్నెపల్లి గ్రామస్థులు ఎదురెళ్లి హారతులు ఇచ్చారు. తమ ఇళ్ల ముందు నిల్చొని స్వాగతం పలికారు. మహిళలే తల్లి ప్రయాణించే మార్గంలో అడుగడుగునా నీళ్లారబోశారు. కోళ్లు, మేకలను బలి ఇచ్చారు. మొక్కులను సమర్పించుకున్నారు. "సారలమ్మ తల్లీ.. మమ్మల్ని చల్లంగ చూడ"ంటూ వేడుకున్నారు. కన్నెపల్లి నుంచి మేడారం వరకు 2 కిలోమీటర్ల మేర దారి పొడవునా భక్తులు బారులుతీరి నిల్చున్నారు. తల్లికి అడుగడుగునా నీరాజనాలు పలికారు.

### జంపన్నవాగు వద్ద పూజలు

కన్నెపల్లి నుంచి జంపన్నవాగు వద్దకు వచ్చిన తర్వాత వాగు ఒడ్డున కొద్దిసేపు తల్లికి జంపన్న తరఫున ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంపన్నవాగు దాటుతుండగా భక్తులు జయజయధ్వానాలు చేశారు. వాగుకు ఇటువైపున ఒడ్డుపై ప్రతిష్ఠితమైన నాగులమ్మ వద్ద కూడా పూజారులు కొద్దిసేపు ఆగారు. అక్కడ కూడా నాగులమ్మ పక్షాన సారలమ్మకు పూజలు నిర్వహించారు. ఆ తర్వాత అక్కడి నుంచి మేడారంలోని సమ్మక్క గుడికి సారలమ్మను తీసుకువచ్చారు. అప్పటికే మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి చేరిన పగిడిద్దరాజుతో పాటు గోవిందరాజుతో సహా సమ్మక్క గుడిలో సారలమ్మకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ పగిడిద్దరాజుకు, సమ్మక్కకు కల్యాణం తంతు నిర్వహించారు. ఇది పూర్తయిన తర్వాత గోవిందరాజు, పగిడిద్దరాజు తోడు రాగా, సారలమ్మను మేడారం గద్దె వద్దకు పూజారులు చేర్చారు. ప్రత్యేక పూజా కార్యక్రమం అనంతరం అమ్మను గద్దెపై ప్రతిష్ఠించారు. అదే ప్రాంగణంలో ఒకవైపు గోవిందరాజును, మరోవైపు పగిడిద్దరాజును వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గద్దెలపైకి చేర్చారు. దీనితో మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతర తొలిఘట్టం దిగ్విజయంగా ముగిసినట్లయింది. పోలీసులు కూడా ఊపిరి పీల్చుకున్నారు. కాగా.. సారలమ్మ రాక సందర్భంగా గద్దెల వద్ద భక్తులు పోటెత్తారు. సారలమ్మను, గోవిందరాజు, పగిడిద్దరాజును ఏకకాలంలో దర్శించుకొని తన్మయత్వానికి లోనయ్యారు. ఈ ముగ్గురు దేవతల రాకతో సమ్మక్క ఆగమనానికి సంకేతం లభించినట్లయింది. గతంలో కన్నా భిన్నంగా గద్దెల ఆధునికీకరణలో భాగంగా సమ్మక్కతో పాటు సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలను ఒకదాని వెనుక ఒకటిగా నిర్మించడంతో భక్తులకు దర్శనం సులువైంది.

### జంపన్నవాగులో కొట్టుకుపోయి ఒకరి మృతి

మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర తొలిరోజే జంపన్నవాగులో విషాదం చోటు చేసుకుంది. జాతర కోసం సంతోషంగా వచ్చిన ఓ కుటుంబానికి కన్నీరే మిగిలింది. జంపన్నవాగులో పుణ్యస్నానం కోసం వెళ్లిన కిరణ్(45) అనే భక్తుడు నీటిలో కొట్టుకుపోయి మృతి చెందాడు. మత్స్యశాఖ అధికారులు, రెస్క్యూ టీం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లాకు చెందిన ఆర్.కిరణ్ తన కుటుంబ సభ్యులతో మంగళవారం మేడారం జాతరకు వచ్చారు. చిలుకలగుట్ట ప్రాంతంలో ఓ గదిని అద్దెకు తీసుకొని ఉంటున్నారు. బుధవారం సాయంత్రం సారలమ్మ వస్తోందని తెలిసి జంపన్నవాగులో కుటుంబ సభ్యులతో కలిసి పుణ్య స్నానాలకు వెళ్లారు. జంపన్నవాగు మధ్యలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుందని తెలియక ఆయన లోపలికి వెళ్లి.. వాగు ఉధృతికి కొట్టుకుపోయారు. అక్కడున్న కొందరు యువకులు కాపాడే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. గల్లంతైన కిరణ్ కోసం రెస్క్యూ టీం, గజ ఈతగాళ్లు గాలించగా.. అక్కడికి చాలాదూరంలో ఆయన మృతదేహం కనిపించింది. సంతోషంగా జాతరకు వచ్చిన ఆ కుటుంబం కిరణ్ మృతితో కన్నీరుమున్నీరైంది. ఈ నేపథ్యంలో.. జంపన్నవాగులో స్నానాలు చేసేవారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

### కోళ్లకు వైరస్ దెబ్బ

మేడారం మహా జాతరలో కోళ్లకు వైరస్ దెబ్బ తగిలింది. జాతర ప్రారంభమైన బుధవారం రోజున పలు షాపుల్లో వేల సంఖ్యలో బ్రాయిలర్, నాటు కోళ్లు మృతి చెందాయి. మృతి చెందిన కోళ్లను ట్రాక్టర్లలో అడవికి తరలించి ఖననం చేశారు. మొదటిరోజే పెద్ద సంఖ్యలో కోళ్లు మృతి చెందడంతో వ్యాపారులకు భారీ నష్టం వాటిల్లింది. వైరస్ దెబ్బకు మరింత నష్టం జరుగుతుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా.. అనారోగ్యం బారిన పడిన కోళ్లను సరఫరా చేస్తున్న హోల్‌సేల్ వ్యాపారులపై సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

### సమ్మక్క తల్లి రాకకు ఏర్పాట్లు పూర్తి..

కోట్లాది మంది ఎంతో ఆత్రుతతో ఎదురుచూస్తున్న వనదేవత సమ్మక్క గురువారం మేడారంలోని గద్దెపైకి రానున్నది. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. సమ్మక్క రాకతో మేడారం మహా జాతర శిఖరాగ్ర స్థాయికి చేరుకుంటుంది. ఈ సందర్భంగా ఏర్పాట్లపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) బుధవారం పూజారులు, అధికారులతో చర్చించారు. పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు నివాస గృహానికి వెళ్లి సమ్మక్క ఆలయ శుద్ధి గురించి చర్చించారు. అనంతరం సమ్మక్క గుడిని సందర్శించారు. అక్కడి నుంచి గద్దెలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.







# ట్రోలర్స్‌కు ఇచ్చిపడేసింది

సెలబ్రెటీల లైఫ్ లో సోషల్ మీడియా పెద్ద పాత్ర పోషిస్తుంది. సినిమా సెలబ్రెటీలకు సోషల్ మీడియాలో ఎంత క్రేజ్ ఉంటుందో.. దాని వల్ల నష్టం కూడా అంతే ఉంటుంది. సోషల్ మీడియా ద్వారా చాలా మంది సెలబ్రెటీలు, ముఖ్యంగా హీరోయిన్స్ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతే కాదు హీరోయిన్స్ చాలా మంది లేనిపోని వివాదాల్లో ఇరుక్కుంటూ ఉంటారు. దాంతో సోషల్ మీడియాలో నెటిజన్స్ ఓ రేంజ్‌లో ట్రోల్స్ చేస్తూ ఉంటారు. వివాదాస్పద కామెంట్స్ చేసో లేక, వింత డ్రస్సుల వల్లో ఎదో ఒకరకంగా ట్రోల్స్ కు గురవుతూ ఉంటారు. కొంతమంది హీరోయిన్స్ తమ డ్రస్సింగ్ కారణంగా ట్రోల్స్ బారిన పడుతూ ఉంటారు. మరికొంతమంది సర్జరీల విషయంలో ట్రోల్ చేస్తుంటారు తాజాగా ఓ హీరోయిన్ ను సోషల్ మీడియాలో దారుణంగా ట్రోల్ చేశారు. సర్జరీల విషయంలో హీరోయిన్ పై ట్రోల్స్.. దానికి ఆ స్టార్ హీరోయిన్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. అందాల భామ శ్రుతీహాసన్ ఆచితూచి సినిమాలు చేస్తుంది. రీసెంట్ డేస్ లో వరుసగా పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తూ హిట్స్ అందుకుంటుంది ఈ ముద్దుగుమ్మ. కెరీర్ బిగినింగ్‌లో సక్సెస్ కోసం ఎంతగానో ఎదురుచూసిన శ్రుతిహాసన్ ఆ తర్వాత వరుసగా విజయాలను అందుకుంది. తక్కువ సమయంలోనే ఈ బ్యూటీ స్టార్ హీరోయిన్‌గా మారిపోయింది. స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్‌కు అందుకుంటూ దూసుకుపోతుంది. తెలుగు తమిళ్ సినిమాల్లో హీరోయిన్‌గా రాణిస్తుంది శ్రుతిహాసన్.శ్రుతిహాసన్ అందం పై ట్రోల్స్ వినిపిస్తూ ఉంటాయి. ఆమె అందం కోసం సర్జరీ చేయించుకుందని.. అందుకే ఆమె ఇంత అందంగా ఉందని పలువురు ఆమె పై ట్రోల్స్ చేస్తున్నారు. తాజాగా ఆ ట్రోల్స్ పై స్పందించింది శ్రుతి.. రైనో ప్లాస్టి అనే సర్జరీ గురించి, అలాగే లిప్ ఫిల్లర్స్ గురించి మాట్లాడింది. ఇది నా శరీరం, నా ఇష్టం అలానే నాకు నచ్చిన నిర్ణయం నేను తీసుకుంటాను అని చెప్పుకొచ్చింది శృతిహాసన్.అలాగే రైనో ప్లాస్టి అనేది ముక్కుకు చేసే సర్జరీ.. అంది అందం కోసమే కాదు అంతకు ముందు నా ముక్కుకు గాయం అయ్యింది అనికోసమే సర్జరీ చేయించుకున్నా అని తెలిపింది శ్రుతి.

## వివాదాలు ఎదురవుతాయని ఏ రోజూ ఊహించలేదు

### కుటుంబ వివాదంపై స్పందించిన మంచు లక్ష్మి



తన కుటుంబంలో ఇలాంటి వివాదాలు ఎదురవుతాయని ఏ రోజూ ఊహించలేదని నటి మంచు లక్ష్మి స్పష్టం చేశారు. సినిమా ప్రచారాల కోసం ఇచ్చే ఇంటర్వ్యూలకు తప్ప, ప్రత్యేకంగా వ్యక్తిగత చర్చల కోసం మాట్లాడటానికి పెద్దగా ఆసక్తి చూపబోనని తెలిపారు. ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె, తల్లి–సోదరి–కుమార్తెగా తన పాత్రల గురించి మాట్లాడుతూ, తల్లిగా మాత్రం తనను తాను 10కి 10 మార్కులు వేసుకుంటానని చెప్పింది. మంచు కుటుంబంలో జరిగిన విభేదాలపై కూడా ఆమె స్పందించారు. 'దేవుడు ప్రత్యక్షమై ఒక వరం కోరుకోమంటే... మా కుటుంబం మళ్లీ మునుపటిలాగే ఒక్కటిగా మారాలని మాత్రమే అడుగుతానని అన్నారు. ప్రతి కుటుంబంలోనూ గొడవలు ఉండటం సహజమే అయినా, ఎంత విభేదాలు వచ్చినా చివరకు అందరూ కలిసే ఉండాలనే భావన మనసులో నిలిచి ఉండాలని ఆమె పేర్కొన్నారు. భారతీయ కుటుంబాల్లో మాత్రం కొన్ని సందర్భాల్లో కలహాలు జీవితాంతం విరిగిపోనివ్వాలని భావించే ధోరణి కనిపిస్తుందని, అది సరికాదని వ్యాఖ్యానించారు. 'చివరికి మనకుండేది రక్తసంబంధీకులే. కుటుంబాన్ని కలిసి ఉంచేందుకు అవసరమైన పోరాటం చేయాలిబీ దూరం పెంచుకోవడం మాత్రం ఎప్పుడూ సరైంది కాదని తెలిపారు. 'నేను ముంబయిలో ఉన్నాను. ఇక్కడి పరిస్థితులు తెలిసినా బాధపడలేదని కొందరు వార్తల్లో రాశారు. కానీ నేను పొందిన బాధను నాకు మాత్రమే తెలుసనని మంచు లక్ష్మి చెప్పారు. వివాదాలపై తాను మాట్లాడకపోవడంతో, కొందరు తమకు నచ్చినట్లుగా ఊహాగానాలు సృష్టించారని చెప్పారు. అది నా వ్యక్తిగత విషయం. ఇలాంటి సమస్యలు వస్తాయని నేను ఊహించలేదు. వాటిని చూసి షాక్ అయ్యాను. నా కుటుంబం గురించి నేను అనుకున్నది, ఆ పరిస్థితుల్లో నాకు కలిగిన బాధ బయటివాళ్లకు చెప్పాల్సిన అవసరం లేదని భావించానని ఆమె వ్యాఖ్యానించారు.

## 'ఛాంపియన్ ' భారీ అంచనాలు

హీరో శ్రీకాంత్ కుమారుడు రోషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఛాంపియన్' నుంచి ఫస్ట్ సింగిల్ 'గిరా గిరా' విడుదలైంది. మిక్కీ జే మేయర్ స్వరాలు, రామ్ మిరియాల గానం, కాసర్ల శ్యామ్ సాహిత్యం ఈ గ్రామీణ సాంగ్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిత్రంలో రోషన్ ఫుట్‌బాల్ ప్లేయర్‌గా కనిపిస్తుండగా, హీరోయిన్ అనస్వర రాజన్ 'తాళ్లపూడి చంద్రకళ'గా పరిచయమవుతోంది. గ్రామీణ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న విడుదల కానుంది. సీనియర్ నటుడు శ్రీకాంత్ తనయుడిగా టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చి హీరోగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు మేక రోషన్ . 'పెళ్లిసందడి'తో మంచి గుర్తింపు తెచ్చుకున్న అతడు నటనలో మెరుగులు దిద్దుకుంటూ క్రమంగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఇప్పుడు ఆయన కెరీర్‌లో కీలక అడుగుగా భావిస్తున్న పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా ' ఛాంపియన్ ' భారీ అంచనాల నడుమ తెరకెక్కుతోంది. ఈ సినిమాలో ఫుట్‌బాల్ ప్లేయర్‌గా రోషన్ నటించడం ఆసక్తిగా మారింది. ప్రదీప్ అద్వైత్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'ఛాంపియన్' చిత్రాన్ని స్వప్న సినిమాస్, జీ స్టూడియోస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉంది. డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా ఈ సినిమాను విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ప్రేక్షకుల్లో మంచి క్యూరియాసిటీని రేపింది. పీరియాడిక్ వాతావరణం, గ్రామీణ నేపథ్యం, స్పోర్ట్స్ ఎమోషన్స్ అన్నీ కలిసి ఈ సినిమా యూత్ మరియు ఫ్యామిలీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకునేలా కనిపిస్తోంది. తాజాగా మూవీ టీమ్ ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసింది. 'గిర గిర గిరగింగిరా గిరే' అనే ఈ గ్రామీణ మట్టివాసనతో నిండిన పాట మట్టిలో పెరిగిన మనుషుల నైజం, వారి రోజువారీ జీవితాలను సహజంగా చూపిస్తోంది. ప్రముఖ సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ ఈ సాంగ్‌కు స్వరాలు సమకూర్చగా, రామ్ మిరియాల తనదైన భిన్నమైన ఫోక్ స్టైల్‌తో పాటకు ప్రాణం పోశాడు. కాసర్ల శ్యామ్ రాసిన సాహిత్యం గ్రామీణ వాతావరణాన్ని అచ్చుగుద్దినట్టు ప్రతిబింబించింది.

## ఆ సినిమా చేయడం లేదు

సౌత్ ఇండియన్ స్టార్ నటి కీర్తి సురేష్ చాలాకాలం తర్వాత మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆమె చివరిగా నటించిన పెద్ద తెలుగు సినిమా మెగాస్టార్ చిరంజీవితో చేసిన 'భోళా శంకర్'. ఆ తర్వాత 2025లో సుహాస్‌తో చేసిన ఉప్పు కప్పురంబు విడుదలైనప్పటికీ, ఆ చిత్రం వచ్చిన సంగతే చాలా మందికి తెలియకుండా పోయింది. అవకాశాలు తగ్గాయా? లేక ఆమెకే ఆసక్తి తగ్గిందా? అనేది స్పష్టంగా తెలియకపోయినా, కీర్తి సురేష్ కొంతకాలంగా తెలుగు సినిమాల్లో కనిపించలేదు. దాదాపు విరామం తర్వాత కీర్తి సురేష్ నటిస్తున్న తాజా చిత్రం 'రివాల్వర్ రీటా'. దర్శకుడు చంద్రు రూపొందించిన ఈ లేడీ ఓరియెంటెడ్ మూవీ తెలుగులో కూడా విడుదల కానుంది. డైరెక్ట్ తెలుగు సినిమాతో కాకుండా, డబ్బింగ్ వెర్షన్‌తో తెలుగువారిని ఆకట్టుకోవడానికి కీర్తి సిద్ధమవుతోంది. తాజాగా రివాల్వర్ రీటా ప్రమోషన్ కోసం తెలుగులో ప్రెస్ మీట్ నిర్వహించారు మేకర్స్. ఈ సందర్భంలో సినిమా వివరాలతో పాటు రాబోయే ప్రాజెక్టుల గురించి కూడా కీర్తి సురేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఒక రిపోర్టర్ చాలా కాలంగా ప్రచారంలో ఉన్న 'ఎల్లమ్మ' సినిమా గురించి ప్రశ్నించాడు. 'ఎల్లమ్మ సినిమాలో హీరోయిన్‌గా మీరు నటిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. ఆ విషయం నిజమేనా? అని అడిగాడు. దీనికి కీర్తి స్పష్టంగా స్పందిస్తూ లేదు... నేను 'ఎల్లమ్మ' సినిమా చేయడం లేదని స్పష్టం చేసింది. 'ఎల్లమ్మ' చిత్రానికి కేవలం హీరోయిన్ ఎంపికలోనే కాదు, హీరో విషయంలో కూడా ఇప్పటివరకు స్పష్టత రాలేదు. నాని, శర్వానంద్, నితిన్, బెల్లంకొండ శ్రీనివాస్ వంటి పలువురు నటుల పేర్లు వినిపించగా, తాజాగా సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ పేరు కూడా చర్చలోకి వచ్చింది. అయినప్పటికీ, ఈ ప్రాజెక్ట్‌లో నిజంగా ఎవరు హీరోగా నటిస్తారు, ఎవరు హీరోయిన్‌గా ఉంటారు అన్నది ఇంకా తెలియరాలేదు. హీరోయిన్‌గా కీర్తి సురేష్ లేదన్న సంగతి మాత్రం స్పష్టమైంది. ఇక ఈ సినిమా ఎప్పుడు మొదలవుతుంది? నటీనటుల అధికారిక జాబితా ఎప్పుడెప్పుడు బయటకు వస్తుంది? అనేదానిపై మేకర్స్ నుంచి ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

